క్లుప్తంగా

నేడు సచివాలయ కన్వీనర్లతో సమీక్ష



ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల జేసీఎస్ కన్వీనర్లు, గ్రామ, వార్డు, సచివాలయాల కన్వీనర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం ఉంటుందని ఎమ్మెల్యే కంబాల జోగులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరవుతారన్నారు. సచివాలయాల పరిధిలోని సమస్యలు, వాటి పరిష్కారం, అభివృద్ధి అంశాలపై సమీక్షించడం జరుగుతుందని, నియోజకవర్గంలోని సచివాలయాల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కాంట్రాక్ట్ లెక్చరర్లంతా కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం వేళ సీఎం సందేశంలో భాగంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో వారంతా ఇలా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చేయడం విశేషం.

చురుగ్గా ఫీవర్ సర్వే

సంతకవిటి: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో ఫీవర్ సర్వే గురువారం చురుగ్గా చేపట్టారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితుల వివరాలు సేకరించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి, వైద్యసేవలు, మందులు అందజేసినట్లు సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, అవి తగ్గేవరకు ప్రతిరోజూ ఫీవర్ సర్వే చేయాలని సర్పంచ్ దాసరి దాలినాయుడు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు

రేగిడి: మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్మాణంలోని ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎ.కల్యాణచక్రవర్తి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీల డీడీఓలు, పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన పంచాయతీల వారీగా నిర్మాణ దశలోని ప్రభుత్వ భవనాలతో పాటు అసలు నిర్మాణాలు ప్రారంభించని పంచాయతీల వివరాలను సేకరించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై కూడా సమీక్షించిన ఆయన గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఆరోగ్య తనిఖీలు

బొబ్బిలి: మండలంలోని పిరిడిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మిమ్స్, పుష్పగిరి ఆస్పత్రుల నుంచి విచ్చేసిన వైద్యులు దాదాపు 200 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వివిధ శస్త్ర చికిత్సలకు ఎంపికైన 12 మందిని ఆయా శస్త్రచికిత్సల కోసం మిమ్స్, పుష్పగిరి ఆస్పత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా, శిబిరానికి హాజరైన వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

రూ.30 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు

వంగర: ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు అన్నారు. గురువారం మండలంలోని అరసాడ గ్రామంలో రూ.30 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయి ఏర్పాటు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా అనేకానేక పథకాలను అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎల్.సత్యనారాయణ, పార్టీ నేతలు ఎల్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఇండికేటర్ ఆడిట్

రేగిడి: మండలంలో సేవలందిస్తున్న 108 అంబులెన్స్‌లో హెల్త్ ఇండికేటర్ ఆడిట్ గురువారం నిర్వహించారు. 108 వాహనాల జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్, జిల్లా కో-ఆర్డినేటర్ సాయిషన్ముఖ కలిసి రేగిడి పీహెచ్‌సీ వద్ద ఉన్న 108 వాహనం వద్దకు చేరుకుని, వాహనంలోని మందులు, వైద్య పరికరాలు పరిశీలించి, పని తీరుపై ఆరాతీశారు. హెల్త్ ఇండికేటర్ ఆడిట్‌లో భాగంగా ఈ తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఎంటీలు మీసాల ఈశ్వరరావు, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాలు(సంక్షేమ పథకాలు)తో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని బొద్దాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ల ద్వారా ఏ వ్యక్తికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పాలనతో పాటు గ్రామంలో సచివాలయ పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బాగా గమనించాలన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి అని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర నిధులను ఏ విధంగా దోచుకుందో వివరించారు. వారి హయాంలో నీరు-చెట్టు పథకం పేరిట చాలా అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. టీడీపీ జన్మభూమి కమిటీల వల్ల కూడా ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. అటువంటి ఇబ్బందులు లేకుండా జగనన్న ప్రభుత్వం పాలన చేస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అందరూ బాగుండాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, ప్రజా సంక్షేమం పట్టని టీడీపీకి ఈ దఫా ఎన్నికల్లో కూడా తగిన బుద్ధి చెప్పాలని, ఒక్క ఓటు కూడా మన గ్రామం నుంచి టీడీపీకి వెళ్లకూడదన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలందిస్తున్న వైఎస్సార్ సీపీ మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం మండల కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, సర్పంచ్ ఎన్.తవిటమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, ఎంపీడీఓ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదే..



బాడంగి: జోరువానలోనూ పిండ్రంగివలసలో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిండ్రంగివలస గ్రామంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అన్ని వర్గాల బాగోగుల కోసం ఆయన నిరంతరం పరితపిస్తుంటారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఎన్నో ఏళ్ల డీఎస్సీ-98 అభ్యర్థుల ఉపాధి కలను నెరవేర్చిన సీఎం జగనన్న మళ్లీ ఇప్పుడు కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, వారి చిరకాల వాంఛను నెరవేర్చారన్నారు. ఎన్నికలు, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా ఆయన వెలుగొందుతున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆదరించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, సర్పంచ్ రావాడ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి

వంగర: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, వెలుగు శాఖ ద్వారా అవసరమైన ప్రోత్సాహకాలన్నీ అందిస్తున్నామని రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న ఆయన కాసేపు మాట్లాడారు. స్త్రీనిధి, ఉన్నతి, ఏడో విడత జగనన్న తోడు రుణాల లక్ష్యాలు శతశాతం సాధించాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామైఖ్య సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండేలా వీవోఏలు చర్యలు తీసుకోవాలన్నారు. లైవ్‌స్టాక్ డీపీఎం మూర్తి మాట్లాడుతూ పల్లెల్లో పాడిపశ్రమ ద్వారా అభివృద్ధి చెందేందుకు మహిళలు ముందుకు రావాలన్నారు. ప్రతీ మండలంలో 50 పాడిపశువుల యూనిట్లు, అలాగే ప్రతీ మండలం పరిధిలో 150 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు నెలకొల్పాలని, అందుకు అవసరమైన ఆర్థిక వనరులు వెలుగు శాఖ ద్వారా సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, కార్యదర్శి గంటా సుమతి, ఏపీఎం మీసాల చక్రపాణి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

రూ.11.77 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

- మనబడి నాడు-నేడు డీఈఈ జగ్గారావు



రామభద్రపురం ఎగువ హరిజన వీధి పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న డీఈఈ జగ్గారావు

రామభద్రపురం: మండలంలో మనబడి నాడు-నేడు మొదటి, రెండో విడతల్లో కలిపి దాదాపు రూ.11.77 కోట్ల వ్యయంతో పాఠశాలల అభివృద్ధి చేపట్టామని డీఈఈ జగ్గారావు అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించి, కాసేపు మాట్లాడారు. మొదటి విడతలో 25 పాఠశాలలను రూ.4.34 కోట్లతో ఆధునీకరించామని, రెండో విడతలో 26 పాఠశాలల్లో రూ.7.46 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో 10 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, 16 పాఠశాలల్లో ఆధునీకరణ పనులు చేయిస్తున్నామన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

కూరగాయల విత్తనాల పంపిణీ

వంగర: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తెలిపారు. గురువారం స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం సమకూర్చిన 12 రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఖాళీ స్థలాలు, ఇంటి ఆవరణలో, పంటపొలాల గట్లపై కూరగాయల మొక్కలు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.భగవతి, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమవరంలో 'వైఎస్సార్ పొలంబడి'

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో మెలకువలను మండల వ్యవసాయాధికారి కె.శిరీష వివరించారు. అనంతరం వరి పంటను పరిశీలించి, మిత్ర, శత్రుపురుగుల ఉనికిని గమనించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

రాఖీ మహోత్సవాలు ప్రారంభం

బొబ్బిలి: శ్రావణమాసం పురస్కరించుకుని, స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయంలో రాఖీ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు సంత్ మహారాజ్ సదానందతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ఈ మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్తంగా...

ఎన్నికలకు సర్వం సిద్ధం

వంగర: మండలంలోని రెండు గ్రామ పంచాయతీలు, మూడు వార్డు మెంబర్ల ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు సరఫరా చేసే మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులతో పాటు మెటీరియల్స్‌ను క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ వార్డు మెంబర్ల ఉపఎన్నిక నిర్వహణకు సంబంధించి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఏవో రామలింగేశ్వరరావు గురువారం చర్చించారు. మండలంలోని పాల్తేరు వార్డు మెంబరు ఎన్నిక పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

8 వేల హెక్టార్లలో ఈ-క్రాప్ నమోదు పూర్తి

రాజాం: నియోజకవర్గంలోని వంగర, సంతకవిటి, రేగిడి, రాజాం మండలాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా జరుగుతోందని, 8 వేల హెక్టార్లలో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని వ్యవసాయ శాఖ రాజాం ఏడీ కె.చంద్రరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ ఏడాది 29 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు ఉందని, వరి, మొక్కజొన్న సాగు అధికంగా ఉంటుందన్నారు. రాజాంలో 1,500 హెక్టార్లు, సంతకవిటిలో 3 వేల హెక్టార్లు, రేగిడిలో 2,500 హెక్టార్లు, వంగరలో 1000 హెక్టార్ల మేర ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు.

ఆరు వారాల పాటు వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం ఆరు వారాల పాటు కొనసాగుతుందని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు తెలిపారు. గ్రామంలోని ప్రజలు ఎక్కువగా జ్వరాల బారినపడుతుండడంతో వైద్యసేవలు అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు వైద్యారోగ్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి, ఫీవర్ సర్వే చేపట్టి, రోగులకు ఉచితంగా మందులు అందజేయడం జరుగుతోందన్నారు. గ్రామంలో సర్పంచ్ వియ్యపు చక్రపాణి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు కూడా ముమ్మరం చేశామన్నారు.

కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి

రేగిడి: ఖరీఫ్ సాగులో భాగంగా వరినాట్లు వేసిన వెంటనే కాలిబాటలు కూడా విధిగా ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని రేగిడి, వండానపేట, చాటాయవలస తదితర గ్రామాల్లో వరినాట్లు వేసిన పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే పంటకు గాలి, వెలుతురు బాగా తగలడంతో పాటు పురుగుమందులు, ఎరువులు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

రూ.40 వేల విలువైన నకిలీ ఉత్పత్తుల స్వాధీనం

రాజాం సిటీ: పట్టణంలోని పలు దుకాణాల్లో అక్రమంగా విక్రయిస్తున్న నకిలీ ఉత్పత్తులను హిందుస్థాన్ లీవర్ కంపెనీ ప్రతినిధులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక ఎస్ఐ వీబీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు పట్టణంలోని దుకాణాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. గణపతిరావు అండ్ సన్స్, మహదేవ్ ఫ్యాన్సీ, అయ్యప్ప ఫ్యాన్సీ, శ్రీ శ్రీనివాసా ఫ్యాన్సీ, శ్రీశాంతలక్ష్మి ఫ్యాన్సీ దుకాణాల్లో దాడులు నిర్వహించామని మొత్తం రూ.40 వేల విలువైన నకిలీ ఉత్పత్తులైన త్రీ-రోజెస్, సర్ఫ్ఎక్సెల్ సబ్బులు, షాంపులను స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించామని కంపెనీ ప్రతినిధి ఫణికుమార్ తెలిపారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేయగా, తాను కూడా దర్యాప్తు చేస్తున్నానని సీఐ కె.రవికుమార్ పేర్కొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

తెర్లాం: విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు అన్నారు. ఇటీవల జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న శంబంగి రామకృష్ణను మండల కేంద్రంలో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అన్ని శాఖల అధికారులను, కింద స్థాయి ఉద్యోగులను సమన్వయపరుస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన వ్యక్తిగా ఎంపీడీఓ రామకృష్ణ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని జూట్‌మిల్లు గోడ పక్కనే ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించాలి

తెర్లాం: విద్యార్థులతో తప్పనిసరిగా వర్క్‌బుక్స్ రాయించాలని ఎంఈఓ త్రినాధరావు సూచించారు. మండలంలోని రామన్న అగ్రహారం ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన తొలుత పాఠశాల రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వర్క్‌బుక్స్‌ను ఏవిధంగా రాస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతిరోజూ విద్యార్థులు వర్క్‌బుక్స్ రాసేలా చూడాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల మహాసభ

రేగిడి: మండలంలోని ఉనుకూరులో భవన నిర్మాణ కార్మికుల మూడో మహాసభ గురువారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సురేష్, సీహెచ్.రామ్మూర్తినాయుడు, భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.23 లక్షల వ్యయంతో 3, 4, 8, 9, 18 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లతో పాటు అమ్మిగారి కోనేరు దగ్గరున్న వైఎస్సార్ సర్కిల్ ప్రాంత అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సరిగ్గా 30 ఏళ్ల క్రితం పట్టణంలో వేసిన రోడ్ల స్థానంలో ఇప్పుడు వైఎస్సార్ సీపీ కొత్తగా మళ్లీ రోడ్లు వేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళి, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు గోపాలరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ డీఈఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను ఎంపీపీకి వివరిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

రాజాం సిటీ: పీహెచ్‌సీ వైద్యులు షిఫ్ట్ పద్ధతిలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ లావేటి సులోచన సూచించారు. గురువారం మండలంలోని బొద్దాం పీహెచ్‌సీలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆమె హాజరై, ఆస్పత్రిలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు.. వారు అందిస్తున్న సేవలు, ఆస్పత్రికి వస్తున్న రోగులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు సైతం ఆస్పత్రిలో 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. పాముకాటు, కుక్కకాటు మందులు కూడా ఆస్పత్రిలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

బొబ్బిలి: స్థానిక న్యాయస్థానంలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కోర్టులో సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయం పరిధిలోని పోలీస్ అధికారులతో గురువారం సమావేశమైన ఆయన లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులతో పాటు రాజీకాదగ్గ క్రిమినల్ కేసులను సైతం పరిష్కరించడం జరుగుతుందన్నారు. సివిల్, క్రిమినల్, ప్రి-లిటిగేషన్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని వీటిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫిన్, డీఎస్పీ పి.శ్రీధర్, సీఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



శ్రీనివాసరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

బొండపల్లి(మెంటాడ): వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గంట్రోతు శ్రీనివాసరావు(55) మృతి పార్టీకి తీరని లోటని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. గురువారం వేకువజామున మండలంలోని చల్లపేటలోని స్వగృహంలో శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఆ గ్రామం వెళ్లి, ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో శ్రీనివాసరావు క్రియాశీలకంగా వ్యవహరించి, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ మెంటాడ, గజపతినగరం మండలాల నాయకులు లెంక రత్నాకర్, బెల్లాన త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

తెర్లాం: బొబ్బిలి సబ్‌డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించిన ఆయన పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడి విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనాల తనిఖీలు, రోడ్లపై పెట్రోలింగ్, వాహన చోదకులకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు స్టేషన్ల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి సబ్‌డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. తెర్లాం పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది 15 రోడ్డు ప్రమాదాలు జరగగా, ఈ ఏడాది కేవలం మూడు ప్రమాదాలు మాత్రమే ఇంతవరకు జరిగాయన్నారు. గంజాయి రవాణా, పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి విక్రయించిన వారిపైనా, కాల్చిన వారిపైనా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. తెర్లాం మండలంలోని ఉద్దవోలులో ప్రశాంత వాతావరణం నెలకొందని, ప్రస్తుతం కొద్దిమంది పోలీసులతో పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు. ఎస్ఐ ప్రతిరోజూ వెళ్లి, అక్కడి పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు అన్నీ సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

